
సాక్షి
శ్రీపొట్టి శ్రీరాములు నెల్లూరు
బుధవారం, 21, మే, 2025



సోమశిలలో 45.627 టీఎంసీలు

సోమశిల: జలాశయంలో మంగళవారం 45.627 టీయంసీల నీరుంది. పెన్నార్ డెల్టాకు 4,300, ఉత్తర, దక్షిణ కాలువలకు 150 క్యూసెక్కులు విడుదల చేస్తున్నారు.



బంగారం ధరలు

24 క్యారెట్లు (10గ్రాములు)	రూ.96,800
22 క్యారెట్లు ఆర్నమెంట్ (1 గ్రా)	రూ.8,763
3శాతం జీఎస్టీతో	రూ.9,026
నవర (8గ్రా)	రూ.72,208

గరిష్టం/కనిష్టం
33.9 /26.5

వాతావరణం

జిల్లాలో వాతావరణం బుధవారం సాధారణంగా ఉంటుందని ఆ శాఖ అధికారులు తెలిపారు. గాలిలో తేమ మంగళవారం 72 శాతంగా నమోదైంది.

న్యూస్‌రీల్

డీఈఓ కార్యాలయ ముట్టడి వాయిదా

నెల్లూరు (టౌన్): రాష్ట్ర ప్రభుత్వం ఉపాధ్యాయ బదిలీలు, సర్దుబాటుకు సంబంధించి ఉపాధ్యాయ సంఘాల ఐక్యవేదికతో జరిపిన చర్చల దరిమిలా బుధవారం తలపెట్టిన డీఈఓ కార్యాలయం ముట్టడి కార్యక్రమాన్ని వాయిదా వేస్తున్నట్లు ఆ వేదిక స్టీరింగ్ కమిటీ సభ్యుడు సురేంద్రరెడ్డి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎస్జీటీలకు మాన్యువల్ పద్ధతిలో కౌన్సెలింగ్, ఉన్నత పాఠశాలల్లో 49 రోల్ దాటితే రెండో సెక్షన్ ఏర్పాటు, ఫౌండేషన్ పాఠశాలల్లో 20 మంది దాటితే రెండో టీచర్‌ను ఇవ్వడం, ఖాళీలను బ్లాక్ చేయకుండా అన్నీ ప్రదర్శించడం, పీఎస్‌హెచ్‌ఎం పదోన్నతులు కల్పించడం, ఎంఈఓలకు బదిలీలు తదితర సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం సానుకూలత వ్యక్తం చేసినట్లు చెప్పారు.

కామాక్షితాయికి పురుషామృగ సేవ



పురుషామృగ వాహనంపై విహరిస్తున్న మల్లికార్జునస్వామి సమేత కామాక్షితాయి

బుచ్చిరెడ్డిపాళెం రూరల్: మండలంలోని జొన్నవాడలోని మల్లికార్జునస్వామి సమేత కామాక్షితాయి ఆలయంలో వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా మంగళవారం స్వామి, అమ్మవారు పురుషామృగ వాహనంపై విహరించారు. అధిక సంఖ్యలో భక్తులు పాల్గొని స్వామి, అమ్మవార్లను దర్శించుకున్నారు. తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. ఏర్పాట్లు ఈఓ శ్రీనివాసులురెడ్డి పర్యవేక్షించారు.

డీసీపల్లిలో 473 పొగాకు బేళ్ల విక్రయం

మర్రిపాడు: మండలంలోని డీసీపల్లి పొగాకు బోర్డు వేలం కేంద్రంలో మంగళవారం 473 పొగాకు బేళ్లను విక్రయించినట్లు వేలం నిర్వహణాధికారి జీ రాజశేఖర్ తెలిపారు. వేలానికి 544 బేళ్లు రాగా 473 బేళ్లను విక్రయించామని, మిగిలిన బేళ్లను వివిధ కారణాలతో తిరస్కరించినట్లు తెలిపారు. వేలంలో 62245.1 కిలోల పొగాకు విక్రయించగా రూ.1,59,84,237.10 వ్యాపారం జరిగింది. కిలోకు గరిష్ట ధర రూ.280, కనిష్ట ధర రూ.200 లభించగా, సగటు ధర రూ.256.80 లభించింది. వేలంలో 9 కంపెనీల వ్యాపార ప్రతినిధులు పాల్గొన్నారు.

ఐ సెట్‌లో బాలురదే హవా

నెల్లూరు (టౌన్): ఎంసీఏ, ఎంబీఏ కోర్సుల్లో ప్రవేశం కోసం నిర్వహించిన ఇంటిగ్రేటెడ్ కామన్ ఎంట్రెన్స్ టెస్ట్ (ఐసెట్) ఫలితాల్లో బాలురు హవా ప్రదర్శించారు. ఈ నెల 7న ఐసెట్ జరిగింది. ఈ పరీక్షకు 774 మంది బాలురు హాజరు కాగా 725 మంది ఉత్తీర్ణతతో 93.65 శాతం అర్హత సాధించారు. బాలికలు 952 మందికి 909 మంది ఉత్తీర్ణులు కాగా, 95.48 శాతం అర్హత సాధించారు.

పంచాయతీ కార్యదర్శుల సస్పెన్షన్

నెల్లూరు (పొగతోట): కోవూరు మండలం పడుగుపాడు పంచాయతీ కార్యదర్శి వి.హజరత్ బాబు, సైదాపురం పంచాయతీ పూర్వ కార్యదర్శి షేక్ యస్దానిబాషాను సస్పెండ్ చేస్తూ మంగళవారం పంచాయతీరాజ్ కమిషనర్ వీఆర్ కృష్ణతేజ ఉత్తర్వులు జారీ చేశారు. ఈ మేరకు డీపీఓ కార్యాలయానికి ఆ ఉత్తర్వులు అందాయి. పడుగుపాడు పంచాయతీ కార్యదర్శి హజరత్‌బాబు రూ.25,51,910 నిధులను ఎటువంటి బిల్లులు లేకుండా దుర్వినియోగం చేసినట్లు నిర్ధారణ కావడంతో విధుల నుంచి సస్పెండ్ చేశారు. సైదాపురం పంచాయతీ పూర్వ కార్యదర్శి షేక్ యస్దానిబాషా జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకానికి సంబంధించి రూ.20,33,646 నిధులను డైరెక్ట్‌గా తన పేరుపై డ్రా చేసుకుని సొంతానికి వాడుకున్నట్లు సమాచారం. ఈ నిధులను కాంట్రాక్టర్ల పేరుతో డ్రా చేయాల్సి ఉండగా కార్యదర్శి నేరుగా డ్రా చేసుకోవడంతో అతనిపై వేటు పడింది. గతంలో నిధులు పక్కదారి పట్టాయంటూ ఓ వ్యక్తి సమాచార హక్కు చట్టం కింద దరఖాస్తు చేయడంతో ఈ విషయం వెలుగు చూసింది. ఆ మేరకు ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేయడంతో సమగ్ర విచారణ చేసి పంచాయతీరాజ్ కమిషనర్‌కు నివేదిక పంపడంతో అతనిపై చర్యలు తీసుకున్నట్లు తెలిసింది. ప్రస్తుతం యస్దానిబాషా విడవలూరు మండలంలో పంచాయతీ కార్యదర్శిగా విధులను నిర్వర్తిస్తున్నారు.

రేషన్ మాఫియా మాటే శాసనం

జిల్లాలో రేషన్ బియ్యం మాఫియా ఆదేశాలను పౌరసరఫరాల శాఖ పాటిస్తోంది. ఆ శాఖలోని కొందరు అధికారులు మామూళ్లు తీసుకొని మాఫియా ఏం చెబితే అదే చేస్తున్నారు. అవుట్ సోర్సింగ్ పోస్టింగ్‌ల నుంచి, బియ్యం అక్రమ రవాణాకు క్లీన్‌చిట్ ఇచ్చే వరకు పౌరసరఫరాల శాఖ మాఫియా చేతిలో కీలుబొమ్మలా మారింది. మాఫియా డాన్ ద్వారా గుంటూరు, ప్రకాశం, వైఎస్సార్ జిల్లాల నుంచి ఇక్కడికి ప్రతి నెలా వచ్చే బియ్యంలో 80 శాతం విదేశాలకు తరలిపోతోంది.



అనుసరిస్తున్న పౌరసరఫరాల శాఖ

నిబంధనలకు విరుద్ధంగా ఎంఎల్‌ఎస్ పాయింట్‌లో అవుట్ సోర్సింగ్ నియామకాలు

అక్కడి నుంచే పేదల బియ్యం అక్రమంగా తరలింపు

నెల్లూరు (పొగతోట): అధికార పార్టీ ప్రజా ప్రతినిధుల అండదండలు, అధికారుల సహాయ సహకారాలతో రేషన్ బియ్యం మాఫియా యథేచ్ఛగా చెలరేగిపోతోంది. ఒక్క మాటలో చెప్పాలంటే.. ఆశించే స్థాయి నుంచి శాసించే స్థాయికి మాఫియా ఎదిగింది. అక్కడక్కడ రేషన్ బియ్యం వ్యాపారం సాగించే చిరు వ్యాపారులను పట్టుకుని కేసులు నమోదు చేస్తున్న పౌరసరఫరాల శాఖాధికారులు, లారీలకు లారీలే తరలిస్తున్న మాఫియా జోలికి పోవడం లేదు. జిల్లాలోనే కాకుండా పక్క జిల్లాల నుంచి భారీ స్థాయిలో లారీల్లో బియ్యం తరలిపోతున్న విషయం జగద్విదితమే. అయితే రేషన్ షాపుల డీలర్లపై కానీ, అక్రమ రవాణాదారులపై కానీ ఒక్క కేసు నమోదు చేసిన చరిత్ర ఈ 11 నెలల కాలంలో ఎక్కడా జరగలేదంటే పౌరసరఫరాల శాఖ చిత్తశుద్ధి అర్థమవుతోంది. ఆఖరికి కావలి ఎంఎల్‌ఎస్ పాయింట్ నుంచి రేషన్ మాఫియా అక్రమంగా దాదాపు వెయ్యి బస్తాల రేషన్ బియ్యం తరలించినట్లు గుర్తించిన పౌరసరఫరాల శాఖ ఇంత వరకు కేసు నమోదు చేయలేదంటే.. ఈ శాఖను ఎవరు నడిపిస్తున్నారో అర్థమవుతోంది. ఇటీవల కోవూరు, దగదర్తి మండలాల్లో పట్టుబడిన రేషన్ బియ్యం లారీలను సైతం గంటల్లోనే వదిలేశారంటే దీన్ని బట్టి మాఫియా ఏ స్థాయిలో శాసిస్తోందో స్పష్టమవుతోంది.

కలువాయిలో లారీ నుంచి ట్రాక్టర్‌కు బియ్యం లోడ్ చేస్తున్న హమాలీలు

80 శాతం బియ్యం విదేశాలకు ఎగుమతి

జిల్లాలో 1,563 చౌకదుకాణాలు ఉండగా 7.23 లక్షల రేషన్‌కార్డులు ఉన్నాయి. ప్రతి నెలా 12,500 మెట్రిక్ టన్నుల బియ్యం కార్డుదారులకు చౌకదుకాణాల ద్వారా పంపిణీ చేస్తున్నారు. అయితే జిల్లాలో క్షేత్రస్థాయిలో పరిశీలిస్తే.. 80 శాతం బియ్యం అక్రమ మార్గంలో రాష్ట్ర, దేశ హద్దులు దాటుతున్నాయని తెలుస్తోంది. జిల్లానే కాకుండా ప్రకాశం, వైఎస్సార్, గుంటూరు జిల్లాల నుంచి సైతం పేదల బియ్యం కావలి, నెల్లూరు కేంద్రంగా రైస్ మిల్లులకు చేరుతున్నాయి. ఇక్కడ పాలిష్ పట్టి స్థానిక మార్కెట్లో అధిక ధరలకు విక్రయంతోపాటు కృష్ణపట్నం పోర్టు, చెన్నై పోర్టుల ద్వారా విదేశాలకు ఎగుమతి అవుతున్నాయి. జిల్లాలో బియ్యం మాఫియా డాన్‌గా వ్యవహరిస్తున్న వ్యక్తికి షిప్‌లో 30 శాతం వాటా ఉన్నట్లు సమాచారం. కూటమి ప్రభుత్వంలో మంత్రులు, ఎమ్మెల్యేల అండదండలు పూర్తి స్థాయిలో ఉండడం, అక్రమ రవాణాకు సహకరించిన అధికారులకు నెల నెలా రూ.లక్షల్లో మామూళ్లు అందుతుండడంతో మాఫియాను అడ్డుకునేందుకు ఎవరు ముందుకు రావడం లేదు. ఇదిలా ఉంటే బియ్యం మాఫియా డాన్ తన అక్రమ సంపాదనతో ఏకంగా ఒక రైస్ మిల్లును ఏర్పాటు చేశాడు. అధిక మొత్తంలో బియ్యం వస్తుండడంతో నగర పరిధిలోని సౌత్‌రాజుపాళెంలో మరో రెండు రైస్ మిల్లులను లీజుకు తీసుకుని పేదల బియ్యం పాలిష్ పడుతున్నట్లు సమాచారం. ఈ మూడు మిల్లుల్లో పేదల బియ్యం మాత్రమే పాలిష్ పట్టి ఇతర ప్రాంతాలకు తరలిస్తున్నారు. ఇక్కడ ఈ ఏడాది కాలంలో ధాన్యం కొనుగోలు చేసి ఆడించినట్లు రికార్డులు కూడా లేకపోవడం గమనార్హం.

కాంట్రాక్ట్ ఉద్యోగులకే ఇన్‌చార్జి బాధ్యతలు

ఎంఎల్‌ఎస్ పాయింట్లకు డిప్యూటీ తహసీల్దార్ హోదా ఉండే అధికారిని ఇన్‌చార్జిగా నియమించాల్సి ఉంది. అయితే అందుకు భిన్నంగా జిల్లాలో మూడు ఎంఎల్‌ఎస్ పాయింట్లకు అవుట్ సోర్సింగ్ సిబ్బందిని (టెక్నికల్ అసిస్టెంట్లు) ఇన్‌చార్జిలుగా నియమించారు. ఈ నియామకాల వెనుక రేషన్ మాఫియా పెత్తనమే ఉన్నట్లు తెలుస్తోంది. ప్రైవేట్ ఉద్యోగులు బాధ్యతా రాహిత్యంగా వ్యవహరిస్తుండడంతో ఎంఎల్‌ఎస్ పాయింట్ల నుంచే బియ్యం రైస్ మిల్లులకు చేరుతోంది. కలువాయి మండలంలో వేయింగ్ మెషీన్లను మరమ్మతులు చేసే టెక్నీషియన్ అక్రమ రవాణాకు కీలకంగా వ్యవహరిస్తున్నట్లు సమాచారం. చేజర్ల, అనంతసాగరం, కలువాయి చుట్టు పక్కల మండలాలకు సంబంధించి కలువాయిలో అక్రమంగా బియ్యం నిల్వ చేస్తున్నారు. ఏ షాపునకు ఎన్ని బస్తాలు సరఫరా చేయాలి, ఎన్ని బస్తాలు అక్రమంగా తరలించాలి తదితర విషయాలను టెక్నీషియన్ దగ్గరుండి చూస్తున్నట్లు తెలిసింది. ఇటీవల కలువాయి మండలంలో మినీ ట్రక్కులో రేషన్ బియ్యం అక్రమ రవాణా చేస్తున్న విషయం గమనించిన ఇద్దరు విలేకరులు మినీ వాహనాన్ని వెంబడించారు. విషయం గమనించిన బియ్యం అక్రమ రవాణాదారులు ఆటోతో విలేకరుల వాహనాలను ఢీకొట్టించే ప్రయత్నం చేశారు. దీంతో విలేకరులు భయభ్రాంతులకు గురై వెనుదిరిగారు.

"విచారించి చర్యలు తీసుకుంటాం

బియ్యం అక్రమ రవాణాకు సంబంధించి ఫిర్యాదులు అందితే తనిఖీలు నిర్వహించి వాహనాలు సీజ్ చేస్తున్నాం. ఎంఎల్‌ఎస్ పాయింట్లకు పూర్తి స్థాయిలో డీటీ స్థాయి అధికారులను నియమించేలా చర్యలు తీసుకుంటాం. ట్రాక్టర్లకు సైతం జీపీఎస్ సిస్టమ్‌ను అమలు చేస్తున్నాం. బియ్యం అక్రమ రవాణాకు సంబంధించి ప్రజలు ఫిర్యాదు చేస్తే దాడులు నిర్వహించి సంబంధిత వ్యక్తులపై కేసులు నమోదు చేస్తాం.

– విజయకుమార్, డీఎస్‌ఓ

ప్రాణం ఖరీదు రూ.6 లక్షలు



ఏరియా వైద్యశాలలో మృతి చెందిన సునీత

- ఏరియా వైద్యశాల డాక్టర్ల నిర్లక్ష్యానికి బాలింత మృతి
- బంధువుల ఆందోళనతో కుదిరిన రాజీ

కావలి (జలదంకి): కుటుంబ నియంత్రణ ఆపరేషన్ కోసం ఏరియా వైద్యశాలలో చేరి వైద్యుల నిర్లక్ష్యానికి బలైపోయిన బాలింత కుటుంబానికి రూ.6 లక్షలు పరిహారంగా ఇచ్చే విధంగా రాజీ జరిగినట్లు సమాచారం. కావలి మండలం మద్దూరుపాడుకు చెందిన రావినూతల జనార్దన్ భార్య సునీత ఇటీవల ఓ ప్రైవేట్ వైద్యశాలలో కాన్పు జరిగింది. ఈ నేపథ్యంలో వ్యాసెక్టమీ ఆపరేషన్ చేయించుకునేందుకు సోమవారం కావలి ఏరియా వైద్యశాలలో అడ్మిట్ కాగా ఓ మహిళా డాక్టర్ ఆపరేషన్ చేసింది. గంట వరకు మత్తు ఉంటుందని బంధువులకు తెలిపింది. గంట తర్వాత కూడా సునీత స్పృహలోకి రాకపోవడంతో వైద్యులకు విషయాన్ని తెలపడంతో వారు వచ్చి పరీక్షించి మృతి చెందినట్లు నిర్ధారించారు. దీంతో ఆమె బంధువులు వైద్యుల నిర్లక్ష్యం వల్లే సునీత మృతి చెందిందంటూ ఆందోళనకు దిగారు. అయితే వైద్యులు మాత్రం ఆపరేషన్ అనంతరం భయాందోళనతోనే గుండెపోటు వచ్చి మరణించి ఉండొచ్చని తెలిపారు. దీంతో కావలి ఒకటో పట్టణ ఎస్సై సుమన్ అక్కడికి చేరుకుని సునీత బంధువులు, వైద్యులతో మాట్లాడారు. మంగళవారం కూడా బంధువులు ఆందోళనకు దిగడంతో వైద్యులు రూ.6 లక్షలు సునీత కుటుంబ సభ్యులకు పరిహారంగా ఇచ్చేలా రాజీ కుదుర్చుకున్నట్లు తెలుస్తుంది.

తల్లీబిడ్డ ఎక్స్‌ప్రెస్ పైలట్ల నిరసన

- మూడు నెలలుగా జీతాలివ్వని ప్రభుత్వం

నెల్లూరు (అర్బన్): తల్లీబిడ్డ ఎక్స్‌ప్రెస్ (102) వాహనాల్లో పనిచేస్తున్న పైలట్లు తమ సమస్యలను తీర్చాలని కోరుతూ మంగళవారం ఒక్క రోజు సమ్మె చేశారు. ఈ సందర్భంగా కలెక్టరేట్ ఎదుట నిరసన తెలిపారు. ఏపీ తల్లీబిడ్డ ఎక్స్‌ప్రెస్ యూనియన్ జిల్లా అధ్యక్షుడు ఎస్‌కే మస్తాన్ మాట్లాడుతూ ప్రభుత్వ ఆస్పత్రుల్లో కాన్పు జరిగిన తర్వాత తల్లీబిడ్డను ఇంటికి క్షేమంగా చేర్చేందుకు 2015లో ఈ పథకాన్ని ప్రవేశ పెట్టారన్నారు. నాటి నుంచి నేటి వరకు కేవలం రోజుకు రూ.262 చొప్పున నెలకు రూ.7,870 మాత్రమే జీతంగా అందుకుంటున్నామన్నారు. ఆ జీతాలను కూడా గత మూడు నెలలుగా ప్రభుత్వం నుంచి కాంట్రాక్ట్ పొందిన అరబిందో సంస్థ ఇవ్వకపోవడం దారుణమన్నారు. ప్రభుత్వానికి వినతిపత్రాలు ఇచ్చినా పట్టించుకోక పోవడం దుర్మార్గమన్నారు. మూడు నెలలుగా వాహనాలకు సంబంధించి పెట్రోల్ ఇవ్వకపోవడంతో రాష్ట్ర వ్యాప్తంగా వాహనాలు తిరగడం లేదన్నారు. కాన్పునకు వచ్చిన పేద మహిళలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. తమతో 104 వాహనాల్లో విధులను కూడా బలవంతంగా చేయిస్తున్నారన్నారు.



నిరసన చేస్తున్న తల్లీబిడ్డ ఎక్స్‌ప్రెస్ పైలట్లు

సెలవులు అసలు లేవన్నారు. ప్రభుత్వం తక్షణమే స్పందించి నెలకు రూ.18,500 కనీస వేతనం ఇవ్వాలని, పీఎఫ్ వాటాను యాజమాన్యం చెల్లించాలని, పండగలు, వారాంతపు సెలవులు ఇవ్వాలని కోరారు. వాహనాల మరమ్మతులను వెంటనే చేపట్టాలని కోరారు. మూడు నెలలుగా పెండింగ్‌లో ఉన్న జీతాలను తక్షణమే విడుదల చేయాలన్నారు. 8 గంటల పని విధానాన్ని అమలు చేయాలని, తమను ఆప్కాస్ ఏజెన్సీలో చేర్చాలని డిమాండ్ చేశారు. ప్రమాదాలు జరిగినప్పుడు రూ.7లక్షల వరకు ఇన్సూరెన్స్ కల్పించాలని కోరారు. అనంతరం కలెక్టరేట్ అధికారులకు వినతి పత్రం ఇచ్చారు. ఈ కార్యక్రమంలో అసోసియేషన్ ఉపాధ్యక్షుడు సునీల్‌రెడ్డి, మహేష్, ఫయాజ్, అమీర్, రఫీ, సందీప్ తదితరులు పాల్గొన్నారు.

రేషన్ పంపిణీ పగ్గాలు డీలర్లకే

- ఎండీయూ ఆపరేటర్లకు బ్రేకులు
- ఉత్తర్వులు జారీ చేసిన ప్రభుత్వం



డీఎస్‌ఓని కలిసిన చౌకదుకాణం డీలర్లు

నెల్లూరు (పొగతోట): రేషన్ కార్డుదారులకు ఇంటి వద్దకే సరుకుల పంపిణీకి గత ప్రభుత్వం అమల్లోకి తెచ్చిన ఎండీయూ (మొబైల్ డిస్పెన్సింగ్ యూనిట్) సేవలకు శాశ్వత ముగింపు పలుకుతూ రాష్ట్ర ప్రభుత్వం తాజాగా ఉత్తర్వులు జారీ చేసింది. ఇక నుంచి గతంలో మాదిరిగానే రేషన్ షాపుల వద్దే డీలర్లే సరుకులు పంపిణీ చేసే విధంగా పగ్గాలు కట్టబెట్టింది. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత తొలగిస్తారని ప్రచారం ఇప్పుడు నిజమైంది. అప్పట్లో ప్రజల నుంచి వ్యతిరేకత రావడంతో ఆ నిర్ణయాన్ని ప్రభుత్వం కొంత కాలంగా వాయిదా వేసింది. తాజాగా కార్డు దారులు ఇళ్ల వద్దకు వాహనాలు వచ్చి రేషన్ పంపిణీ చేసే వ్యవస్థకు కూటమి ప్రభుత్వం మంగళం పాడింది. దీంతో రేషన్ డీలర్లు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. ఇన్నాళ్లు ఇంటి వద్దకే ఎండీయూ ద్వారా రేషన్ సరుకులు పొందిన లబ్ధిదారులు ఇక నుంచి పడిగాపుల పంపిణీకి కూటమి ప్రభుత్వం తలుపులు తెరిచింది. రేషన్ డీలర్లు చౌకదుకాణం తీసిన సమయంలోనే వెళ్లి రేషన్ తీసుకోవాల్సి ఉంది. ప్రతి నెలా 1వ తేదీ నుంచి కార్డు దారులందరూ చౌక దుకాణాల వద్ద బారులు తీరి రేషన్ తీసుకోవాల్సి ఉంటుంది. అవ్వా, తాత ఎవరైనా సరే రేషన్ షాపునకు వెళ్లాల్సిందే.

'పది' పరీక్షకు 77 మంది గైర్హాజరు

నెల్లూరు (టౌన్): పదో తరగతి అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ పరీక్షకు మంగళవారం జిల్లా వ్యాప్తంగా మొత్తం 77 మంది విద్యార్థులు గైర్హాజరయ్యారు. జిల్లాలో 328 మంది విద్యార్థులకు 251 మంది హాజరయ్యారు.

కూటమి ప్రభుత్వ తీరుపై బ్రాహ్మణాగ్రహం

- ఆంధ్రకేసరి వర్ధంతిని విస్మరించడంపై అసహనం
- నల్లబ్యాడ్జీలతో నిరసన, ప్రకాశం పంతులు మెడలో నల్లరిబ్బన్ మాల
- బ్రాహ్మణ సంఘాల ఆధ్వర్యంలో క్షీరాభిషేకం
- వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో ఘనంగా నిర్వహించారని ప్రశంసలు

నెల్లూరు (బృందావనం): ఆంధ్రరాష్ట్ర తొలి ముఖ్యమంత్రి ఆంధ్రకేసరి టంగుటూరి ప్రకాశం పంతులు 68వ వర్ధంతిని విస్మరించిన కూటమి ప్రభుత్వం, అధికార యంత్రాంగం తీరుపై ఆంధ్రప్రదేశ్ బ్రాహ్మణ సంక్షేమ సమాఖ్య రాష్ట్ర, జిల్లా బ్రాహ్మణ సేవా సంఘాల సమితి నేతలు మంగళవారం ఆగ్రహం వ్యక్తం చేశారు. నెల్లూరు నగరంలోని మద్రాస్ బస్టాండ్ వద్ద ఏసీ మార్కెట్ ఎదురుగా ఉన్న ఆయన విగ్రహం స్థూపంపై చెత్తాచెదారం కూడా తొలగించకుండా అవమానించారంటూ జిల్లా, నగరపాలక సంస్థ అధికారులపై అసహనం వ్యక్తం చేశారు. విగ్రహం, పరిసరాల వద్ద పడి ఉన్న చెత్తాచెదారం, మద్యం సీసాలు తొలగించి శుభ్రం చేశారు. అనంతరం ఆయన విగ్రహానికి క్షీరాభిషేకం నిర్వహించారు. అనంతరం విగ్రహానికి శాలువాలు కప్పి, పూలమాలలు వేసి ఘనంగా శ్రద్ధాంజలి ఘటించారు. నల్లబ్యాడ్జీలను ధరించి, ప్రకాశం పంతులు విగ్రహం మెడలోనూ నల్ల రిబ్బన్ మాలవేసి ప్రభుత్వ వైఖరిపై నిరసన తెలియజేశారు. ఈ సందర్భంగా ఆంధ్రప్రదేశ్ బ్రాహ్మణ సంక్షేమ సమాఖ్య రాష్ట్ర నేతలు, జిల్లా బ్రాహ్మణ సేవా సంఘాల సమితి అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు గుడ్లదొన వాసుదేవరావు, ఇసుకపల్లి కామేశ్వరప్రసాద్ తదితరులు మాట్లాడుతూ స్వాతంత్ర్య పోరాటంలో సైమన్ కమిషన్ గో బ్యాక్ అంటూ నినదించి బ్రిటిష్ వారిని ఎదిరించి ఆంగ్లేయుల తుపాకీకి గుండె ఎదురొడ్డి వెన్ను చూపని ధీరోదాత్తుడు, దేశం, రాష్ట్రం కోసం సర్వం త్యాగం చేసిన ఆంధ్రకేసరి ప్రకాశం పంతులు జయంతి, వర్ధంతిని అధికారికంగా, ప్రభుత్వ పండగగా నిర్వహించాలని గతంలో సీఎం చంద్రబాబు చెప్పారన్నారు. అయితే ఆయన పాలనలోనే వర్ధంతిని నిర్వహించకపోవడం శోచనీయమంటూ ఆగ్రహం వ్యక్తం చేశారు. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో జయంతి, వర్ధంతులను ఘనంగా నిర్వహించారని గుర్తు చేస్తూ మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వ పనితీరును ప్రశంసించారు. ఈ కార్యక్రమంలో సమితి కోశాధికారి దుద్దుకూరి రమేష్, మహిళా విభాగం అధ్యక్ష, కార్యదర్శులు ఐ.జయలక్ష్మి, ఉమాదేవి, మద్దూలపల్లి శ్రీధర్‌శర్మ తదితరులు పాల్గొన్నారు.



ప్రకాశం పంతులు విగ్రహానికి క్షీరాభిషేకం చేస్తున్న బ్రాహ్మణ సంఘు నేతలు



ఏసీ కూరగాయల మార్కెట్ సమీపంలో ఆంధ్రకేసరి విగ్రహం వద్ద అధ్వానంగా ఉన్న దృశ్యం

యోగా సాధనతో ఆరోగ్యం



యోగాసనాలు వేస్తున్న కలెక్టర్

- కలెక్టర్ ఆనంద్

నెల్లూరు (స్టోన్‌హౌస్‌పేట): యోగాను ప్రతి రోజూ సాధన చేస్తే ఆస్పత్రులతో అవసరం లేని ఆరోగ్యవంతమైన జీవితం సొంతం అవుతుందని కలెక్టర్ ఓ.ఆనంద్ అన్నారు. అంతర్జాతీయ యోగా దినోత్సవ సన్నాహ ఏర్పాట్లలో భాగంగా మంగళవారం నగరంలోని ఏసీ సుబ్బారెడ్డి స్పోర్ట్స్ కాంప్లెక్స్‌లో జరిగిన యోగోత్సవ్‌లో కలెక్టర్ పాల్గొన్నారు. ఆయన మాట్లాడుతూ 11వ అంతర్జాతీయ యోగా దినోత్సవానికి ప్రధాన మంత్రి మోదీ విశాఖపట్నం వస్తున్న నేపథ్యంలో యోగాపై అవగాహనకు రాబోయే నెల రోజుల పాటు జిల్లాలోని ప్రతి మండలంలో, ప్రతి గ్రామంలో ప్రత్యేక కార్యక్రమాలను నిర్వహిస్తున్నామన్నారు. వేసవి సెలవుల అనంతరం పాఠశాల, కళాశాలల్లో సైతం యోగా సాధనపై అవగాహన కల్పించాలన్నారు. ఈ సందర్భంగా నిర్వహించిన వక్తృత్వ, సాంస్కృతిక పోటీల్లో విజేతలైన చిన్నారులకు ఆయన ప్రశంసా పత్రాలు, జ్ఞాపికలు అందజేశారు. డీఎస్‌డీఓ ఆర్‌కే యతిరాజ్, సెట్నల్ సీఈఓ నాగేశ్వరరావు, యోగా గురువు స్వప్న, విఘ్నేష్, విజయ్‌కుమార్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.



క్లుప్తంగా

అంతా మా ఇష్టం

- ఆగని చికెన్ వ్యర్థాల తరలింపు
- ఈసారి 30 డ్రమ్ముల పట్టివేత

సంగం: చికెన్ వ్యర్థాల తరలింపు ఆగడం లేదు. కొందరు చేపల గుంతల నిర్వాహకులు అధికార పార్టీ నేతల అండతో ఇతర రాష్ట్రాల నుంచి వాటిని తెప్పిస్తూనే ఉన్నారు. నాలుగు రోజులుగా వరుసగా వాహనాలను పట్టుకుంటున్నారు. అయినా గుంతల నిర్వాహకులు మాత్రం వెనక్కు తగ్గడం లేదు. మంగళవారం కూడా కర్ణాటక నుంచి సంగంకు మినీలారీలో తెచ్చిన 30 డ్రమ్ముల చికెన్ వ్యర్థాలను స్థానికుల సాయంతో పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. వాటిని గుంతలో పూడ్చివేశారు. వాహన ఓనర్, నిర్వాహకులపై కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు. ఇదిలా ఉండగా నిత్యం కర్ణాటక నుంచి అక్రమంగా వ్యర్థాలను తరలిస్తుండగా స్థానికులు పట్టుకుంటున్నారు. అయితే స్వాధీనం చేసుకుంటున్న పోలీసులు లారీ యజమానులు, డ్రైవర్లపైనే కేసులు నమోదు చేస్తున్నారు. అసలు వాటిని తెప్పిస్తున్న నిర్వాహకులపై కఠిన చర్యలు తీసుకోవడం లేదని విమర్శలున్నాయి. ముడుపులు అందుతుండటంతోనే ఈ పరిస్థితి ఉన్నట్లు ప్రచారం జరుగుతోంది.

బియ్యం కార్డులకు దరఖాస్తు చేసుకోండి

- డీఎస్ఓ విజయ్‌కుమార్



వివరాలు తెలుసుకుంటున్న డీఎస్ఓ

నెల్లూరు(పొగతోట): ప్రజలు బియ్యం కార్డుల కోసం సచివాలయాల ద్వారా దరఖాస్తు చేసుకోవాలని డీఎస్ఓ విజయ్‌కుమార్ తెలిపారు. నెల్లూరు వేదాయపాళెంలోని సచివాలయంలో దరఖాస్తుల నమోదు ప్రక్రియను మంగళవారం డీఎస్ఓ పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ ప్రక్రియలో ఎదురవుతున్న సమస్యలను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించేలా చర్యలు తీసుకుంటామన్నారు.

చిన్న చెరువుల అభివృద్ధికి చర్యలు

నెల్లూరు(పొగతోట): గ్రామీణ ప్రాంతాల్లో ఉపాధి హామీ ద్వారా చిన్న చెరువులను పల్లె పుష్కరిణిగా అభివృద్ధి చేసేందుకు ప్రణాళికలు సిద్ధం చేయాలని డ్వామా పీడీ గంగా భవాని ఆదేశించారు. నెల్లూరులోని డ్వామా కార్యాలయం నుంచి మంగళవారం మండల సిబ్బందితో నిర్వహించిన టెలీ కాన్ఫరెన్స్‌లో పీడీ మాట్లాడారు. ఉపాధి నిధుల ద్వారా యంత్రాలతో పూడికతీత పనులను చేపట్టాలన్నారు. పంచాయతీ స్థలాల్లో పల్లె వనాలను అభివృద్ధి చేయాలన్నారు.

నిమ్మ ధరలు (కిలో)



పెద్దవి : రూ.80
సన్నవి : రూ.45
పండ్లు : రూ.25



జోరుగా.. హుషారుగా..

జిల్లాలో అడపాదడపా మోస్తరు వానలు కురుస్తున్నాయి. ఈ నేపథ్యంలో రైతులు వ్యవసాయ పనులు మొదలుపెట్టారు. పొలాల్లో సందడి నెలకొంది. కోవూరు నియోజకవర్గంలో కూలీలు వరినాట్లు వేస్తుండగా తీసిన చిత్రం.

దూసుకెళ్తూ..

ఖాళీ దొరికితే చాలు పిల్లలు స్మార్ట్ ఫోన్‌లో మునిగిపోతారు. ఆటలాడేవారి సంఖ్య నానాటికీ తగ్గిపోతోంది. కొందరు మాత్రం ఈ వేసవి సెలవులను ఉపయోగించుకుంటున్నారు. నెల్లూరులోని చిల్డ్రన్స్ పార్క్‌లో పిల్లలు రోలర్ స్కేటింగ్ నేర్చుకుంటున్నారు.





ఏమ్మా.. ఇది తగునా!

ట్రాఫిక్ నిబంధనల్ని ఉల్లంఘించడం కొందరికి అలవాటైపోయింది. ఇది ప్రమాదకరమని తెలిసినా పట్టించుకోవడం లేదు. మోటార్‌బైక్, స్కూటీలపై పరిమితికి మించి తిరిగేస్తున్నారు. నెల్లూరు వనంతోపు సెంటర్‌లో స్కూటీపై నలుగురు మహిళలు వెళ్తుండగా తీసిన చిత్రం.

ఫొటోలు - సాక్షి ఫొటోగ్రాఫర్, నెల్లూరు

నేర నియంత్రణకు చర్యలు



గ్రామస్తులతో మాట్లాడుతున్న కలిగిరి సీఐ పీవీ నారాయణ

నెల్లూరు(క్రైమ్): ప్రజల భాగస్వామ్యంతోనే నేరాల కట్టడి సాధ్యమని భావించిన పోలీస్ యంత్రాంగం సోమవారం రాత్రి జిల్లా వ్యాప్తంగా అన్ని గ్రామాల్లోని పెద్దలు, యువతతో సమావేశాలు నిర్వహించింది. ఎస్పీ జి.కృష్ణకాంత్ ఆదేశాల మేరకు నేర నియంత్రణ, అసాంఘిక కార్యకలాపాలు, అక్రమ రవాణా కట్టడికి తీసుకోవాల్సిన చర్యలపై అవగాహన కల్పించారు. శాంతిభద్రతలకు విఘాతం కలగకుండా శాంతియుత వాతావరణంలో జీవించాలని గ్రామస్తులకు సూచించారు. మత్తు, మాదకద్రవ్యాలకు దూరంగా ఉండాలని, సైబర్ నేరాలపట్ల అప్రమత్తంగా ఉండాలన్నారు. యువత చెడు వ్యసనాలకు బానిసై జీవితాలను నాశనం చేసుకోవద్దని, చట్టవ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడితే చర్యలు తప్పవని హెచ్చరించారు. మద్యం, గంజాయితోపాటు ఇసుక అక్రమ రవాణాకు అడ్డుకట్ట వేసేందుకు సహకారం అందించాలని గ్రామస్తులను కోరారు. అసాంఘిక కార్యకలాపాలు, అక్రమ రవాణాపై స్థానిక పోలీసులకు, డయల్ 112కు సమాచారం అందిస్తే తగిన చర్యలు తీసుకుంటామని సూచించారు.

'సాక్షి' రిపోర్టర్ కుటుంబానికి విక్రమ్‌రెడ్డి సాయం



ఆర్థిక సాయం అందజేస్తున్న నేతలు

నెల్లూరు(అర్బన్): సాక్షి దినపత్రికలో చేజర్ల మండల రిపోర్టర్‌గా పనిచేస్తూ అనారోగ్యంతో మృతిచెందిన రవీంద్రబాబు అంత్యక్రియలు స్వగ్రామమైన కలువాయి మండలం కుల్లూరు గ్రామంలో మంగళవారం జరిగాయి. ఆత్మకూరు మాజీ ఎమ్మెల్యే మేకపాటి విక్రమ్‌రెడ్డి తన వంతుగా బాధితుడి కుటుంబానికి వైఎస్సార్‌సీపీ చేజర్ల మండల నాయకుల ద్వారా రూ.50 వేలు ఆర్థిక సాయం అందజేశారు. మట్టి ఖర్చుల కింద సాక్షి నెల్లూరు యూనిట్ మేనేజర్ శ్రీనివాసులు రూ.5 వేలు అందించారు. వైఎస్సార్‌సీపీ జిల్లా బూత్ కమిటీల అధ్యక్షుడు బాలిరెడ్డి సుధాకర్‌రెడ్డి, నాయకులు పోలంరెడ్డి చంద్రశేఖర్‌రెడ్డి, తేళ్ల శేఖరయ్య, ఉగ్గుమూరు రఘురామిరెడ్డి, బ్యూరో ఇన్‌చార్జి మస్తాన్‌రెడ్డి, బీఎం శ్రీనివాసులు అంత్యక్రియలకు హాజరై నివాళులర్పించారు. ఈ సందర్భంగా బీఎం మాట్లాడుతూ త్వరలోనే మృతుడి కుటుంబానికి 'సాక్షి' కార్యాలయం తరఫున రూ.2 లక్షల్ని బీమా ద్వారా అందిస్తామన్నారు.

జవాబుపత్రాల ట్యాంపరింగ్‌పై విచారణ

కందుకూరు రూరల్: సీనియర్ ఇంటర్ ఇంగ్లిష్ జవాబుపత్రాల ట్యాంపరింగ్‌పై మంగళవారం అధికారులు విచారణ చేశారు. కందుకూరులోని ఓవీ రోడ్డులో శ్రీగాయత్రి జూనియర్ కళాశాలకు చెందిన ఎం.అవినాష్ బాబు, టి.సాయి తేజస్విని అనే విద్యార్థుల జవాబుపత్రాలు ట్యాంపరింగ్‌కు గురైన సంగతి తెలిసిందే. వీరు పరీక్ష రాసిన పరీక్ష కేంద్రం శ్రీవివేక జూనియర్ కళాశాల ప్రిన్సిపల్, ఇన్విజిలేటర్‌ను ఇంటర్మీడియట్ బోర్డు అధికారులు విచారించారు.

ఉచిత శిక్షణకు దరఖాస్తుల ఆహ్వానం

నెల్లూరు(స్టోన్‌హౌస్‌పేట): ఎస్సీ కార్పొరేషన్, జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో ఎస్సీ నిరుద్యోగ యువతకు సీడాప్, లిడ్‌క్యాప్ సహకారంతో ఉచితంగా లెదర్ స్టిచింగ్, కటింగ్ ఆపరేటింగ్‌పై శిక్షణ ఇస్తామని ఎస్సీ కార్పొరేషన్ ఈడీ బి.శ్రీనివాసులు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఐదో తరగతి, ఆపై చదివిన 18 – 35 సంవత్సరాల్లోపు యువతీయువకులు శిక్షణ పొందవచ్చన్నారు. శిక్షణా కాలం 45 రోజులు ఉంటుందని, ఈ సమయంలో ఉచితంగా భోజన వసతి కల్పిస్తామన్నారు. అర్హత ఆసక్తి కలిగిన వారు బయోడేటాతోపాటు ఆధార్, కుల విద్యార్హతల సర్టిఫికెట్ జిరాక్స్ కాపీలు, నాలుగు పాస్‌పోర్ట్ సైజ్ ఫొటోలను జత చేయాలన్నారు. పూర్తి చేసిన దరఖాస్తులను జిల్లా డీఆర్‌డీఏ కార్యాలయంలో, బోగోలులోని వైటీసీ భవనంలో అందజేయాలన్నారు. వివరాలకు 89851 20012, 99497 12982, 94900 80861 ఫోన్ నంబర్లను సంప్రదించాలని కోరారు.

మాటల్లో పెట్టి.. కాళ్ల పట్టీలు కొట్టేసి

- గంటల వ్యవధిలోనే నలుగురు మహిళల అరెస్ట్



వివరాలు వెల్లడిస్తున్న ఇన్‌స్పెక్టర్ కోటేశ్వరరావు

నెల్లూరు(క్రైమ్): కాళ్లపట్టీలను అపహరించుకెళ్లిన మహిళలను గంటల వ్యవధిలోనే పోలీసులు అరెస్ట్ చేశారు. వారి నుంచి చోరీ సొత్తు స్వాధీనం చేసుకున్నారు. మంగళవారం నెల్లూరు చిన్నబజారు పోలీస్‌స్టేషన్‌లో ఇన్‌స్పెక్టర్ చిట్టెం కోటేశ్వరరావు వివరాలను వెల్లడించారు. కోటమిట్ట మెక్లిన్స్ రోడ్డుకు చెందిన డి.చెంచు మునిరెడ్డి ఆచారివీధిలో మేఘనశ్రీ జ్యువెలరీస్‌ను నిర్వహిస్తున్నాడు. సోమవారం నలుగురు మహిళలు అతడి దుకాణానికి వెళ్లారు. వెండి కాళ్లపట్టీలు (గొలుసులు)చూపించాలని అడిగారు. సిబ్బంది వారికి పట్టీలు చూపిస్తుండగా మహిళలు వారిని మాటల్లో దించి రూ.70 వేల విలువైన 740 గ్రాముల ఏడు జతల పట్టీలను దోచుకెళ్లారు. మహిళలు షాపు నుంచి వెళ్లిన తర్వాత పట్టీలు కనిపించకపోవడంతో యజమాని చిన్నబజారు పోలీసులకు ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేశారు. ఇన్‌స్పెక్టర్ కోటేశ్వరరావు పర్యవేక్షణలో ఎస్సై మహబూబ్‌బాషా, క్రైమ్ పార్టీ సిబ్బంది చోరీకి గురైన దుకాణంతోపాటు పరిసర ప్రాంతాల్లోని సీసీ టీవీ ఫుటేజ్‌లను పరిశీలించి నిందితులు రాయచోటి జిల్లా వావిలపాడు మండలానికి చెందిన గీత, జ్యోతి, రవళి, నరసమ్మగా గుర్తించి గాలింపు చర్యలు చేపట్టారు. మంగళవారం సాయంత్రం సౌత్ ఇండియా షాపింగ్ మాల్ సమీపంలో వారిని అరెస్ట్‌చేసి చోరీ సొత్తును స్వాధీనం చేసుకున్నారు.

ఎన్నిరోజుల్లో మాట నిలబెట్టుకుంటారు?

- వైఎస్సార్‌సీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి నిర్మల



మాట్లాడుతున్న నిర్మల

నెల్లూరు(స్టోన్‌హౌస్‌పేట): 'ఆక్రమణలకు గురైన ప్రభుత్వ భూముల్ని స్వాధీనం చేసుకుంటామని మంత్రి నారాయణ అన్నారు. ఎన్నిరోజుల్లో ఆ మాటను నిలబెట్టుకుంటారు' అని వైఎస్సార్‌సీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి మల్లి నిర్మల ప్రశ్నించారు. నెల్లూరు మూలాపేటలోని తన కార్యాలయంలో మంగళవారం ఆమె విలేకరులతో మాట్లాడారు. ప్రజా ధనాన్ని దోచుకుంటున్న వారి విషయంలో మంత్రి చూసీచూడనట్లుగా ఉంటున్నారన్నారు. ఇసుక అక్రమ రవాణా, భూముల కబ్జా గురించి తెలిసినా ఏమీ తెలియనట్లుగా ఉన్న నారాయణకు ఉత్తమ నటుడు అవార్డు ఇవ్వొచ్చన్నారు. కబ్జాకు గురైన సెంటు ప్రభుత్వ భూమినైనా స్వాధీనం చేసుకుని మీడియా సమావేశంలో చెప్పగలరా అని ప్రశ్నించారు. కావాలంటే భూముల్ని తాము చూపిస్తామన్నారు. నెల్లూరు ప్రజలు సంక్షేమ పథకాల కోసం ఎదురుచూస్తున్నారన్నారు. వందల కోట్ల రూపాయల విలువైన భూములను ప్రభుత్వానికి అప్పజెప్పాలన్నారు.

స్తంభం పడి వ్యక్తి మృత్యువాత

కావలి(జలదంకి): కావలి పట్టణంలోని ఉదయగిరి రోడ్డు బొట్లగుంట వద్ద చికెన్ పకోడా దుకాణంపైన ఓ వ్యక్తి పట్ట కడుతుండగా విద్యుత్ సరఫరా జరిగే స్తంభానికి సపోర్టుగా ఉన్న మరో స్తంభం పడటంతో అక్కడికక్కడే మృతిచెందాడు. పోలీసులు, స్థానికుల కథనం మేరకు.. బొట్లగుంటలోని మద్యం దుకాణం సమీపంలో పత్తి సుబ్బారావు అనే వ్యక్తి చికెన్ పకోడా షాపు నిర్వహిస్తున్నాడు. మంగళవారం ఉదయం నుంచి వర్షం కురుస్తుండటంతో అతని స్నేహితుడైన బాలకృష్ణారెడ్డి నగర్‌కు చెందిన మద్దెల వెంకటేష్ (34) సాయంతో షాపుపై పట్ట కడుతున్నారు. ఈక్రమంలో సుబ్బారావు స్టూల్‌పై ఉండి విద్యుత్ స్తంభానికి పట్ట కడుతుండగా సపోర్టుగా ఉన్న స్తంభం వెంకటేష్‌పై పడింది. దీంతో అతను మృతిచెందాడు. ఘటనా స్థలాన్ని కావలి రెండో పట్టణ సీఐ గిరిబాబు పరిశీలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

రైలు కింద పడి గుర్తుతెలియని వ్యక్తి మృతి

కొడవలూరు: రైలు కింద పడి గుర్తుతెలియని వ్యక్తి మృతిచెందిన ఘటన కొడవలూరు – పడుగుపాడు స్టేషన్ల మధ్య మంగళవారం జరిగింది. రైల్వే పోలీసుల కథనం మేరకు.. మృతుడి వయసు 40 – 45 సంవత్సరాల మధ్య ఉంటుందని భావిస్తున్నారు. కాషాయపు రంగు చొక్కా, పసుపు, మెరూన్ రంగుల లుంగీ ధరించి ఉన్నాడు. పొట్టపై ఆపరేషన్ చేసిన గుర్తులున్నాయి. మృతుడి వివరాలు సేకరిస్తున్నట్లు రైల్వే పోలీసులు తెలిపారు.

నెల్లూరు పౌల్ట్రీ అసోసియేషన్ ధరలు

బ్రాయిలర్ (లైవ్)	: 134
లేయర్ (లైవ్)	: 110
బ్రాయిలర్ చికెన్	: 240
బ్రాయిలర్ స్కిన్‌లెస్	: 266
లేయర్ చికెన్	: 187



యువతకు అవగాహన : కలెక్టర్



మాట్లాడుతున్న కలెక్టర్ ఆనంద్

నెల్లూరు(అర్బన్): గంజాయి, గుట్కా, బీడీ, సిగరెట్ తదితర వాటితో కలిగే అనర్థాలపై యువతకు అవగాహన కల్పించాలని కలెక్టర్ ఆనంద్ ఆదేశించారు. మంగళవారం నెల్లూరు కలెక్టరేట్‌లో నషా ముక్త భారత్ అభియాన్ కమిటీ సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జూనియర్ కళాశాలలు, పాఠశాలలు, జనసంచార ప్రాంతాల్లో మాదక ద్రవ్యాలు వినియోగం వల్ల కలిగే నష్టాలు, చట్టపరంగా అమలయ్యే శిక్షలను వివరించాలన్నారు. పోస్టర్లు, కరపత్రాలు ముద్రించి ప్రచారం నిర్వహించాలన్నారు. సమావేశంలో విభిన్న ప్రతిభావంతుల సంక్షేమ శాఖ ఏడీ మహ్మద్ ఆయూబ్, సూపరింటెండెంట్ సంధ్యారాణి, ప్రభుత్వ సర్వజన ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ నరేంద్ర, ఐసీడీఎస్ పీడీ సువర్ణ, ఆర్‌ఐఓ వరప్రసాద్, బాలల సంరక్షణాధికారి సురేష్ తదితరులు పాల్గొన్నారు.

మీ రొయ్యలు మాకొద్దు..

- ఎగుమతి చేసిన వాటిని వెనక్కి పంపుతున్న పలు దేశాలు
- రసాయనిక అవశేషాలున్నాయని వెల్లడి
- చేసేదిలేక తక్కువ ధరకే స్థానికంగా అమ్మేస్తున్న వ్యాపారులు
- ఇకపై నూతన లేబులింగ్‌తో ఎక్స్‌పోర్టుకు శ్రీకారం
- ఉమ్మడి నెల్లూరు జిల్లాలో 6 వేల మంది ఆక్వా రైతులు



రొయ్యలను గ్రేడింగ్ చేస్తున్న దృశ్యం

వాకాడు: ఆక్వా రంగంపై మరో పిడుగు పడింది. రసాయనిక అవశేషాలున్నాయని ఎగుమతి చేసిన ఉత్పత్తులను పలు దేశాలు తీసుకునేందుకు నిరాకరించడంతో రైతులు, వ్యాపారులకు దిక్కుతోచని దుస్థితి దాపురించింది. రొయ్యల కంటైనర్లను వెనక్కు పంపుతుండడంతో ఆక్వా పరిశ్రమ కుదేలైంది. ఇటీవల జపాన్, అమెరికా దేశాలకు చెన్నై నుంచి పంపిన 10 కంటైనర్ల రొయ్యలు తిరిగి వచ్చేశాయి. ఒక్కో కంటైనర్‌లో దాదాపు 60 టన్నుల నుంచి 100 టన్నుల వరకు ప్రాసెస్ చేసిన రొయ్యలుంటాయి. వాటిని ఆయా దేశాల నిపుణులు పరీక్షించి యాంటీబయాటిక్స్ అవశేషాలు ఉన్నట్లు గుర్తించారు. ఆ రొయ్యలను తింటే చర్మ వ్యాధులతోపాటు, వివిధ రకాల వైరస్ సోకుతుందని వెల్లడించారు. సుమారు రూ.264 కోట్లు విలువైన రొయ్యలను రాష్ట్ర వ్యాప్తంగా ఆక్వా వ్యాపారులు నష్టపోయినట్లు తెలిసింది. దీంతో చేసేది లేక వివిధ రాష్ట్రాల్లోని రెస్టారెంట్లు, హోటళ్లతోపాటు స్థానిక మార్కెట్లలో తక్కువ ధరకే విక్రయించుకోవాల్సి వచ్చింది. ఈ ప్రభావంతో రైతుల నుంచి కొనుగోళ్లను వ్యాపారులు నిలిపేశారు. కొందరు వచ్చిన ధరకే స్థానికంగా లూజు విక్రయాలు చేయాల్సి వచ్చింది.

58,580 మెట్రిక్ టన్నుల ఉత్పత్తి

ఉమ్మడి నెల్లూరు జిల్లాలో 6 వేల మంది ఆక్వా రైతులు ఉన్నారు. అధికారికంగా 35 వేల ఎకరాలు, అనధికారికంగా మరో 15 వేల ఎకరాల్లో రొయ్యలు సాగు చేస్తున్నారు. అలాగే హేచరీలు 97 వరకు ఉన్నాయి. తద్వారా ఏటా 58,580 మెట్రిక్ టన్నుల రొయ్యలు ఉత్పత్తి అవుతున్నాయి. మొదటి సీజన్‌లో 30 వేల టన్నులు, రెండో సీజన్‌లో 28 వేల టన్నులు మాత్రమే ఉత్పత్తి ఉంటుంది. అయితే కొందరు రైతులు రెండో క్రాప్‌లో కూడా ఎక్కువ దిగుబడి సాధించేందుకు విచ్చలవిడిగా యాంటీబయాటిక్స్ వాడుతున్నారు. అసలు విషయం గుర్తించకుండా ఎన్ని టన్నుల ఉత్పత్తి పొందామనే లెక్కలు వేసుకుంటున్నారు. ఆ మేరకు ప్రాసెసింగ్ యూనిట్లకు తరలిస్తున్నారు. అక్కడి నుంచి విశాఖపట్నం, కాకినాడ, చెన్నై నగరాల నుంచి విదేశాలకు ఎగుమతి చేస్తున్నారు. యూరోపియన్ యూనియన్‌కు సంబంధించిన పది దేశాలు మన దేశం నుంచి రొయ్యలు దిగుమతి చేసుకుంటున్నాయి. కాగా ప్రధానంగా జపాన్, అమెరికాకు ఎక్కువగా ఎగుమతి అవుతున్నాయి.



రొయ్యల్ని ఎగుమతి చేసే కంటైనర్లు

రవాణాలో కొత్త విధానం

విదేశాలకు ఎగుమతి చేస్తున్న రొయ్యలకు లేబులింగ్ అనే నూతన విధానం అమలు చేయాలని కేంద్ర ప్రభుత్వం నిర్ణయించింది. దీంతో ఏ ప్రాంతంలో రొయ్యలు సాగు చేశారు. ఎలాంటి యాంటీబయాటిక్స్ వాడారు. ఏ యూనిట్లో ప్రాసెస్ పూర్తి చేశారనే వివరాలను ఆ లేబుల్‌పై పొందుపరచనున్నారు. ఈ క్రమంలో అధికంగా యాంటీబయాటిక్స్ వాడుతున్న రైతులను గుర్తించే వెసులుబాటు ఉంటుందని అధికారులు వెల్లడిస్తున్నారు. అలాగే ప్రతి కంటైనర్‌లో 50 శాతం శాంపిళ్లను తప్పనిసరిగా పరీక్షించాలని రాష్ట్ర మత్స్యశాఖ నిర్ణయించింది. కొత్త సూక్ష్మజీవుల జాతులుగా మారే అవకాశం ఉంది.